క్లుప్తంగా

19 నుంచి గురు పూర్ణిమ వేడుకలు

సామర్లకోట: పవిత్ర గురు పూర్ణిమను పురస్కరించుకుని స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 19వ తేదీ నుంచి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.అప్పారావు, కార్యదర్శి గంగ్రోతుల సత్యనారాయణ, కోశాధికారి డి.రాజబాబు తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 19, 20 తేదీల్లో తెల్లవారుజామున బాబావారికి మేలుకొలుపు హారతి, అభిషేకాలు, పూజలు, పారాయణ, సంధ్యా హారతి, భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. అలాగే 20వ తేదీ సాయంత్రం బాబావారి పల్లకీ ఊరేగింపు ఉంటుందని చెప్పారు. గురుపూర్ణిమ సందర్భంగా 21వ తేదీన పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, భక్తులకు దర్శనాలు, 11 గంటల నుంచి స్థానిక రైల్వే కల్యాణ మండపంలో భారీఎత్తున అన్న సమారాధన ఉంటుందని తెలిపారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కోలాహలం


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: ఆషాఢ మాసం తొలి సోమవారం కావడంతో స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఆలయానికి తరలివచ్చి, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామి వారికి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి పూజ, తొలి అభిషేకాలను నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద శివలింగానికి పాలతోను, ఆలయ పుష్కరిణిలో నీటితో స్వయంగా అభిషేకాలు చేశారు. మూలవిరాట్, ఉప ఆలయాల్లోని స్వామి వారు, అమ్మవార్లకు ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజ్‌గోపాల్, సన్నిధిరాజు వెంకన్న పూజలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి


క్రికెట్ టోర్నీ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

కొత్తపల్లి: యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని వెంకటరామలక్ష్మీ ఫ్యాబ్రిక్స్ యజమాని లొల్ల వెంకట శ్రీకాంత్ సూచించారు. మండలంలోని వాకతిప్పలో నిర్వహిస్తున్న వీఆర్ఎల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. వాకతిప్పకు చెందిన గంగా ఫ్రెండ్స్ టీమ్ విజేతగా నిలిచింది. విజేతలకు శ్రీకాంత్ ట్రోఫీ, నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో గోపి హరిబాబు, రాపర్తి శ్రీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని వినతి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడంతో పట్టణంలో పారిశుధ్య పనులు మరింత అధ్వానంగా మారాయని సీపీఎం పట్టణ నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్ అన్నారు. పట్టణ సమస్యలపై ఆర్డీఓ జేఎస్ రామారావుకు సీపీఎం నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆషాఢ మాసంలో జరిగే మరిడమ్మ జాతర నేపథ్యంలో పట్టణంలో యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఆలయ సమీపంలో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మెయిన్ రోడ్డు వేముల వారి సెంటర్‌లో ఉన్న పబ్లిక్ టాయ్‌లెట్ నిర్వహణను పూర్తి స్థాయిలో చేపట్టాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులు మరింత మెరుగుపర్చాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు,. డి.క్రాంతికుమార్ తదితరులున్నారు.


ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


చేబ్రోలులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


పెద్దాపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దవులూరి దొరబాబు, నాయకులు

ప్రజల గుండె చప్పుడు వైఎస్సార్

- ఘనంగా మహానేత జయంతి వేడుకలు
- వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఘన నివాళులు
- పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు


పిఠాపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వంగా గీత


సామర్లకోట మండలం జి.మేడపాడులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దవులూరి దొరబాబు, నాయకులు

పిఠాపురం: పాలనలో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సాంపాదించుకున్న ఏకైక నేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వంగా గీత అన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో సోమవారం వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి వంగా గీత పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక మున్సిపల్ ఆఫీస్ పక్కన ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. తొలుత పిఠాపురం అగ్రహారంలో అగ్రహారంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల ప్రెసిడెంట్లు, మున్సిపల్ చైర్మన్లు, మూడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు నగర పంచాయతీలో వైఎస్సార్ సీపీ నేతలు మొగలి అయ్యారావు, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, జ్యోతుల భీముడు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. నగర పంచాయతీలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చేబ్రోలులో వైఎస్సార్ విగ్రహానికి గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, పార్టీ మండలాధ్యక్షులు అరిగెల రామయ్యదొర ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు వైఎస్సార్ చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొండపాటి లోవతల్లి, పార్టీ అధ్యక్షుడు పుప్పాల బాబులు, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని పలు గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పెద్దాపురం: ప్రజాభిమానం చూరగొని, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన మహానేత దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయిన ఆ మహనీయుని అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు సోమవారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి దవులూరి దొరబాబుతో పాటు, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, దవులూరి సుబ్బారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సయ్యద్ జానీ, అత్తిలి సీతారామస్వామి తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ సమాజం గర్వించదగ్గ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఆయన రాజసం ఏ వ్యక్తికీ రాదని కొనియాడారు. అనంతరం వార్డు పరిధిలోని పలు వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరెళ్లి వీర్రాఘవులు, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, సర్పంచ్ కనపర్తి చీమదొర, నల్లల గోవిందు, పెంటా విజయ్‌కుమార్, ఉబా జాన్‌మోజెస్, కరణం భాను, కంటే జగదీష్, కరణం రాజ్‌కుమార్, గుర్రాల యాకోబు, కనపర్తి సుబ్రహ్మణ్యం, బాబి, గోలి రామారావు, పరిమి శ్రీను, ఇనకొండ వీర విష్ణుచక్రం తదితరులు పాల్గొన్నారు.

కాండ్రకోటలో..

మండలంలోని కాండ్రకోట గ్రామంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, జోకా నానాజీ సంయుక్తాధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఒబిలిశెట్టి వెంకటేశ్వరరావు, గంటా రామస్వామి పల్లా గంగారావు, లక్కాకుల కృష్ణ, గవరసాని రాజశేఖర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో..

మండలంలోని తాటిపర్తి గ్రామంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గోపు మురళి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. రైతు నాయకులు గోపు నారాయణమూర్తి, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

రూరల్‌లో..

మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వడ్లమూరులో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, దివిలిలో నరాలశెట్టి త్రినాథ్, చంద్రమాంపల్లిలో కురిమెళ్ల లోవరాజు, జి.రాగంపేటలో బండారు వీరబాబు, గోరింటలో బర్రే రామగోవిందు, పులిమేరులో తుమ్మల అచ్యుతరామయ్య, శిరివాడలో ఇనకొండ వీరవిష్ణుచక్రం, ఉలిమేశ్వరంలో ఆకుల వీరబాబు, ఆర్‌బీ కొత్తూరులో యండ్రు సత్తిబాబు, పల్లా శ్రీనివాస్ యాదవ్, రాయభూపాలపట్నంలో నల్లల నాగేంద్రబాబు, జె.తిమ్మాపురంలో కుండల ప్రసాద్, ఆనూరులో సింగన త్రిమూర్తులు, స్వామి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గ్రామగ్రామాన మహానేతకు నివాళులు

సామర్లకోట: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు పట్టణ, మండల పరిధిలో సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు జి.మేడపాడు తరలివెళ్లారు. అక్కడ మోరంపూడి శ్రీరంగనాయకులు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పట్టాని దేవి, మాజీ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, పుట్టా బుజ్జిబాబు పాల్గొన్నారు. అక్కడి నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రసన్నాంజ నేయస్వామి ఆలయం, రాజీవ్ గృహకల్ప వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు దవులూరి దొరబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి, డాక్టర్ వైఎస్సార్ యువసేన జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక సిరి మానసిక దివ్యాంగుల కేంద్రంలో వారికి, సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలను నాయకులు గుర్తు చేశారు. జగనన్నకాలనీ, పవర గ్రామాల్లో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను దొరబాబు కట్ చేశారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మాజీ ఎంపీపీ అత్తిలి వెంకట సీతారామస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మండల వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ వినుకొండ విష్ణు చక్రం, మాజీ ఎంపీటీసీ మలకల చంటిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, కౌన్సిలర్లు మర్రి శేషారావు, పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, స్వయంభారపు వీరభద్రరావు, కరణం రాజ్‌కుమార్, సేపెని సురేష్, పాగా సురేష్‌కుమార్, మాదిగ ఐక్యవేదిక జిల్లా నాయకుడు కాళ్ల లక్ష్మీనారాయణ, మండల కో–ఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్, పార్టీ నాయకులు మసకపల్లి సత్యనారాయణ, వేగి సత్యనారాయణ, కానుబోయిన విజయకృష్ణ, చిట్టుమాని శ్రీనివాసరావు, కానేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో..

సామర్లకోట మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాధవపట్నం గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తుల కృష్ణార్జునరావు, చీరట్ల లక్ష్మీదుర్గ, బొండిలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తోట సత్తిబాబు, పార్టీ అధ్యక్షుడు పరంధామశెట్టి, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పి.వేమవరంలో పార్టీ సీనియర్ నాయకుడు ముసిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. చంద్రపాలెం గ్రామంలో పండపాక దొరబాబు, వేట్లపాలెంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పీబీ దేవంలో మలకల సూరిబాబు, ఉండూరులో సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, నవర గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వీకే రాయపురంలో జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, పవరలో తాటికొండ అచ్చిరాజు, నవర సర్పంచ్ దమ్మాల లక్ష్మణరావు, నాగనబోయిన రాజబాబుల ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

కొత్తపల్లి: సంక్షేమ సారథి, దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వాకతిప్పలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, పార్టీ నాయకులు గోపి హరిబాబు, జ్యోతుల చక్రబ్బాయి, కుక్కల వెంటరమణ తదితరులు పాల్గొన్నారు. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, మత్స్యకార నాయకుడు ఉమ్మిడి జాన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీటీసీలు మేరుగు ఎల్లాజీ, చొక్క సింగన్న, కంబాల లక్ష్మణరావు, అద్దా త్రిమూర్తులు, వడ్డి నాగమణి తదితరులు పాల్గొన్నారు. నాగులాపల్లిలో వైఎస్సార్ కాంస్య విగ్రహానికి వడిశెట్టి నారాయణరెడ్డి, అబ్బిరెడ్డి రామచంద్రరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమణక్కపేటలో వైఎస్సార్ విగ్రహానికి కాజులూరి నెర్లారెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెనుమళ్ల పాపిరెడ్డి, పెనుమళ్ల కృష్ణారెడ్డి, లొడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వంగా గీత


కాండ్రకోటలో వైఎస్సార్ విగ్రహం వద్ద కార్యకర్తల శ్రద్ధాంజలి


సామర్లకోటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు


వాకతిప్పలో వైఎస్సార్ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు


గొల్లప్రోలులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ షాన్ మోహన్
- పిఠాపురంలో నియోజకవర్గస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, అర్జీలు అందించడానికి వచ్చిన ప్రజలు

పిఠాపురం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. స్థానిక రథాలపేటలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సోమవారం పిఠాపురం నియోజకవర్గస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులతో కలిసి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు బదిలీ చేశారు. ఆయా సమస్యలకు త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని మండల, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు.

మొత్తం 556 అర్జీలు

ప్రజల నుంచి మొత్తం 556 అర్జీలు అందాయి. ప్రధానంగా రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూ రికార్డుల ఆన్‌లైన్, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, శ్మశాన వాటికకు స్థలం మంజూరు తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. తొలుత జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఆర్డీఓ ఇట్ల కిషోర్ తదితరులు భారత రాజ్యాంగం నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ సూచనల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి రెండు వారాలకొకసారి నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించి ఆన్‌లైన్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షిస్తామన్నారు. ఆర్థిక పరమైన అంశాలతో ముడిపడిన అర్జీలను నిధుల మంజూరైన తరువాత పరిష్కరిస్తామన్నారు. ఇందుకు అర్జీదారులు కొంత సమయం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుంచి తగు ఆదేశాలు జారీ అయిన వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. కాగా రెండున్నరేళ్లుగా తన కూతురు కనిపించడం లేదని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ ఓ తల్లి ఫిర్యాదు కలెక్టర్ షాన్ మోహన్‌కు ఫిర్యాదు చేసింది. అధికారులు చర్యలు తీసుకుని ఎలాగైనా తన కూతురు ఆచూకీ తెలుసుకోవాలని కలెక్టర్‌ను కోరింది. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎస్ఎన్ వర్మ, జనసేన నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరావు నియోజకవర్గంలో సామాజిక అవసరాలపై జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జిల్లా ఉపాధి శిక్షణాధికారి జి.శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు పి.నారాయణమూర్తి, ప్రసాద్ రాజు, పిఠాపురం, గొల్లప్రోలు కమిషనర్లు ఎస్.కనకరావు, టి.రవికుమార్, పిఠాపురం, గొల్లప్రోలు తహసీల్దార్లు కె.లక్ష్మి, ఎం.ఉదయభాస్కరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో వివిధ మండలాల నుంచి 11 అర్జీలు అందినట్టు చెప్పారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారం కోసం డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులు స్పందనకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ వారం స్పందనకు ఎనిమిది అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో డీఎల్పీఓ బాలామణి, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, డీటీ భానుకుమార్, అధికారులు పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి గల్లంతు


వేమనదొర (ఫైల్)

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం లోని చెరువులో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన రైతు తట్టవర్తి వేమనదొర ఆర్ ఆర్‌బీ చెరువులో గేదెలను కడగడానికి ఆదివారం సాయంత్రం వెళ్లాడు. అక్కడ పని పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఒక గేదె కనిపించలేదు. ఆ గేదెను వెతకడానికి తిరిగి వెనక్కి వెళ్లాడు. తర్వాత ఎంతకూ తిరిగి రాకపోవడంతో అతని బంధువులు ఆయా పరిసరాలను గాలించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో చెరువులో దిగి గల్లంతై ఉంటాడని అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఎంపీపీ సుధకు పితృ వియోగం


సూర్యారావు(ఫైల్)

కొత్తపల్లి: ఎంపీపీ కారే సుధకు పితృ వియోగం కలిగింది. తొండంగి మండలం దానవాయిపేటకు చెందిన ఆమె తండ్రి బెణుగు సూర్యారావు (70) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఎంపీపీ సుధ, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావును వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, రావు చిన్నారావు, పితాని కాశీ, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, కుక్కల వెంకటరమణ, బండి దావీదు తదితరులు ఉన్నారు.

రోడ్డుపై భోజనాలతో నిరసన


రోడ్డుపై కూర్చుని భోజనాలు చేస్తున్న కార్మికులు

సామర్లకోట: రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని చేపట్టిన నిరసన సోమవారం కొనసాగింది. కార్మికులు ఫ్యాక్టరీ గేటు ఎదురుగా రోడ్డుపై బైఠాయించి, భోజనాలు చేసి నిరసన తెలిపారు. కార్మికుల ఆందోళన 28వ రోజుకు చేరింది. తమను తొలగించి 84 రోజులు గడిచినట్టు కార్మికులు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, కార్మికులు పాల్గొన్నారు.